


(గత సంచిక తరువాయి)

## 8

"పరీక్షలన్నీ బాగానే వ్రాశాను." అని భర్తనోటినించి విని తృప్తిగా నిట్టూర్చింది పద్మజ.

"ఈ రోజు కదలకుండా హాయిగా పడుకోండి" అంది ముచ్చటగా భర్తని చూస్తూ.

"అలాగే. మరి నువ్వుకూడా రా."

"నేనెందుకు?"

"తోడు."

"తోడులేందే నిద్రపోరా?" చిలిపిగా అడిగింది.

"అబ్బ ! ఈ వారంరోజులూ మీ వాళ్ళింట్లో వంటరిగా పడుకోవాలంటే అసలు నిద్రేపట్టలేదు."

"అందుకనే పరీక్షలు బాగా రాసారు."

చక్రపాణి నవ్వి "నిజమేననుకో! ఇంక వంటరిగా పడుకోలేను."

పద్మజ వచ్చి అతని ప్రక్కనే కూర్చుంది.

"వంట్లో ఎలావుంది పద్మా? మందులవీ జాగ్రత్తగా వాడుతున్నావా ?" అనడిగాడు ఆప్యాయంగా దగ్గరకి తీసుకుని.

"బాగానేవుంది. నాన్న ఉత్తరం రాసారు. వచ్చి తీసుకెడతానని."

"వెళ్ళద్దు పద్మా! ఇక్కడే పురుడు పోసుకో."

"అత్తయ్యగారొక్కరూ చేయొద్దా."

"వదిన వుందిగదా! అంతగాఅయితే మీ అమ్మని పిలిపిద్దాము." భార్య ముంగురులు సవరిస్తూ అన్నాడు.

మీ అమ్మగారేమంటారో మరి ఇంకా అడగలేదు

ఆ మర్నాడు అత్తగారిని అడిగింది పద్మజ.

ఆమెకి మనవడిని వదిలిపెట్టి వుండాలని లేదు

"ఇక్కడే పోసుకుందువుగానిలేమ్మా" అంది.

పద్మజ మళ్ళీ మాట్లాడలేదు.

పద్మజకి ఈసారికూడా మగపిల్లాడే పుట్టాడు.

పద్మజకి మళ్ళీ మగపిల్లాడే కలిగేసరికి జయలక్ష్మి కాస్త చిన్నబోయింది. ఆమెకి వరసనే ముగ్గురూ ఆడపిల్లలే !

అనుకున్నట్టుగానే చక్రపాణి సెకండ్ క్లాస్‌లో పాసయ్యాడు.

పద్మజ ఆనందానికి అవధులులేవు. మనవడు పుట్టేసరికే ఏనుగెక్కిన కామయ్య మళ్ళీ క్రిందకి దిగకుండానే కొడుకు పాసయిపోయాడు.

బారసాల పీటలమీద కంచిపట్టుచీర కోడలికి చదివించాడు కామయ్య. చిన్న మనవడికి స్వయంగా తనే మొలతాడు చేయించాడు బంగారంతో. ఇవన్నీ చూసేసరికి జయలక్ష్మి కి చాలా బాధనిపించింది. కొడుకుపుట్టని తన దురదృష్టానికిచాటుగా ఏడవసాగింది.

అది చూసిన సూరమ్మ "శుభమాంటూ బిడ్డపుడితే ఏడుస్తావెందుకు ఈసారి నీకూ మగపిల్లాడు పుడతాడులే: తప్పు, ఏడవకు. పద్మజ వింటే బాధపడుతుంది," అంది కాస్త మందలింపూ, ఓదార్పూ రంగరించి.

"చూసావా! సూరమ్మ ఇద్దరు మనవళ్ళనెత్తింది" అని ఒకరు,

"కామయ్య చిన్నకొడుకు ఇంటరు పాసయిపోయాడట." అని మరి కొందరు,

"ఇంతకీ చిన్నకోడను అడుగుపెట్టిన వేళ మంచిది" అని ఇంకొందరు.

"ఆ అమ్మాయే భర్తని చదివించి పాసు చేయించింది. ఎంతైనా చదువు

కున్న పిల్ల, తెలివైనపిల్ల!" అని కొందరూ కామయ్య కుటుంబాన్ని గురించే ముచ్చటించుకోసాగారు.

ఎక్కడికెళ్ళినా కామయ్యకి సూర మ్మకి పొగడ్తలే.

ఏ నోట విన్నా చక్రపాణి గురించిన ప్రశంసలే!

ఈసారి పద్మజ చెప్పకుండానే బి.ఏ. కి కట్టాడు చక్రపాణి.

"ఇంతవరకూ చదివింది చాలు, ఇంకా బి.ఏ. ఎందుకురా మూడువేలు ఖర్చు" అన్నాడు కామయ్య.

"మూడువేలయితే ఏం నాన్నా! డిగ్రీ వస్తుందిగదా!" అన్నాడు చక్ర పాణి.

"మన వ్యవసాయం మనకుండనే వుంది. ఉద్యోగాలేమీ చేయబోవడం లేదు గదా! పొలంపనులకి బి.ఏ. దేనికిరా!" అన్నాడు కామయ్య.

"వ్యవసాయం చేసుకుంటున్నా చదు వనేది వుండటం మంచిది, మామగారూ! రేపు కలెక్టర్లతో పనిబడినా, మరేదన్నా వ్యవహారాలు పరిష్కరించాల్చి వచ్చినా ఇంగ్లీషులో మాట్లాడటం. తెలిసివుంటే అవతలి వాళ్ళు వీళ్ళూ చదువుకున్న వాళ్ళేనని కాస్త వెనక్కి తగ్గి మోసం చేయడానికి ప్రయత్నించరు. అమాయ కంగా కనబడితే ఒకాట ఆడించాలని చూస్తారు" అంది నచ్చచెప్పే ధోరణిలో పద్మజ.

కామయ్యకి మనసులో నిజమేనని పించింది. ఏదన్నా ఇంగ్లీషులో వస్తే కరణంగారింటికి వెళ్ళి చదివించుకున్న తన వెనకటి పరిస్థితి గుర్తుకొచ్చి ఇంకేం తర్కించలేదు.

"ఏదో పెద్ద చదివానని బోడి టెన్త్ క్లాస్‌కు మిడిసిపడింది రామయ్యకూతురు! ఇప్పుడు చెప్పమను సమాధానం! రేపో మాపో నా కొడుకూ గ్రాడ్యుయేటవబోతు న్నాడు!" అనుకుంటూ మీసం తిప్పాడు.

*　*　*

సత్యవతి తన ఫేలయిన ప్రేమాయ ణంతో సరిగ్గా చదవలేకపోయింది. ఫలి తంగా ఇంగ్లీషులో పాసవలేకపోయింది. లెక్కల్లోనూ మార్కులు తక్కువే వచ్చాయి.

ఆ రెండింటికీ మళ్ళీ వెడదాం అని నిశ్చయించుకుంది. మైపు హయ్యరు పరీక్షరాసి రిజల్టుకోసం చూస్తోంది.

సత్యవతి చెల్లెలు రత్నకుమారి ఒక ఆడపిల్ల తల్లి అయింది. పిల్లలు లేరను కున్న పినతల్లి అనసూయకి ఇద్దరు పిల్లలు పుట్టారు.

సత్యవతి హయ్యరు పాసైంది. తన కున్న క్వాలిఫికేషన్స్‌తో ఉద్యోగం చేయాలని సంకల్పించి కొన్నింటికి దర ఖాస్తులు పెట్టిందికూడా!

కాని మనసులో ఎక్కడో మారు మూల ఒంటరితనం బాధిస్తూనే వుంది.

తనకంటే చిన్నది తన చెల్లెలు ముచ్చటగా సంసారం చేసుకుంటూ పిల్లల్ని కంటోంది.

తను, తన వయసు యవ్వనం అంతా వృథా చేసుకుంటూ ఇలా ఒంటరిగానే గడుపుతుందా! మురళిని పెళ్ళి చేసుకోవాలని ఉబలాటపడితే అతను తప్పించుకున్నాడు ఇంక తనకి పెళ్ళి, పెటాకులు, సంసారం, సుఖం అనేవి లేక, ఇలా చదువులు, పరీక్షలు, పాసు ఫెయిల్, వీటితోనే సతమతమవుతుందా! ఇవే ప్రశ్నలు ఆమెని కలచివేయసాగాయి. "పోనీ కాస్త ఉద్యోగం దొరికినా బాగుండును. పగలన్నా హాయిగా గడిచిపోతుంది," అనుకుంది మనసులో.

అలా దరఖాస్తులు పంపగా పంపగా ఒకదానికి పిలుపు వచ్చింది. ఆమె మొర విన్నట్టే భగవంతుడు ఆమెకి ఆ ఉద్యోగం దొరికేట్టుకూడా చేసాడు. నెలకి 130 రూపాయలమీద చేరింది. ఆ కంపెనీలో.

ఉద్యోగంలో చేరాక కాస్త మన శ్శాంతి చిక్కింది సత్యవతికి.

ఆ ఆఫీసులో ఆమె ప్రక్కసీటే మదన్‌ది. మదన్ చాలా చలాకీ పురుషుడు. అతడు సత్యవతి రాగానే పలకరించాడు.

ఛామనఛాయ, ఎప్పుడూ మడత నలగని బట్టలు, చెదరని క్రాపు అతదిని చూస్తుంటే తను కలలుగన్న మనోహరరూపం ఇతడే అనుకుంది సత్యవతి. తొలిచూపులోనే అతనందే ఆకర్షణ కలిగింది.

మధ్యాహ్నం "కాస్త కాఫీ త్రాగుదాం రండి," అంటూ పిలిచాడు సత్యవతిని.

చిరునవ్వు నవ్వుతూ అతన్ని అనుసరించింది సత్యవతి. "మీకీ ఆఫీసు క్రొత్త. నేను నాలుగేళ్ళనించీ పనిచేస్తున్నాను. మీకేమన్నా తెలియకపోతే నన్నడగండి," అంటూ ప్రారంభించాడు ఉపోద్ఘాతంగా!


సత్యవతి అలాగే నన్నట్టు తల ఊపింది.

"మన ఎదుటి సీట్లో వున్నాడే! ఆయన పేరు రామ్మూర్తి. అంతా మూర్తి అంటాంలెండి. వట్టిడబ్బుగోల. ఎప్పుడూ పది అయిదు బదులడుగుతూనేవుంటాడు. మీరు మాత్రం ఇవ్వకండి. ఇచ్చారా, మళ్ళీ ఇక తిరిగిరావు.

అతని ప్రక్కన కూర్చున్నాడు చూశారూ, అతని పేరు వాసు. ఆడపిల్లలంటే మహ మోజు. పొరపాటునైనా అతనితో మాట్లాడకండి. అంటూ ఒక్కొక్కరిని గురించివివరించసాగాడు వింటూన్న సత్యవతికి మతిపోయింది. అమ్మబాబోయ్! ఇదేం ఆఫీసు ? అని భయపడింది మనసులోనే.

"ఇలాంటి వ్యక్తులయితే ఆఫీసులో పనిచేయడం కష్టమే" అంది మెల్లగా.

"మరేం భయపడకండి. మనం




ఎవరిజోలికీ పోకుండావుంటే సరి! ఎవరేం చేస్తారు? మీకు ఏం కావలసి వచ్చినా నేను అండగా నిలబడతాను," అంటూ అభయహస్తం ఇచ్చాడు.

కృతజ్ఞతగా చూసింది అతనికేసి సత్యవతి.

వారంరోజులు గడిచేసరికి కాస్త బెరుకుతగ్గి ధైర్యం చేకూరింది సత్యవతికి మదన్ ఆమెకి కావలసినవన్నీ తనే సమకూరుస్తూ బాగా పరిచయం, స్నేహం పెంచుకున్నాడు. అసలు మొదటే అతని రూపం, మాటకారితనం బాగా ఆకర్షించిన సత్యవతికి అతనితో సాన్నిహిత్యం బాగా పెరిగి అతనితోటి స్నేహం ఆమెలో కొత్త ఆశలు రేపాయి. "ఎలాగైనా తామిద్దరూ పెళ్ళాడితే బాగుండు"నని ఆమెకి కోరిక కలగ సాగింది.

"ఈ రోజు సినిమాకి వెడదాం రండి! మొదటాటకి. అప్సరాలో మంచి పిక్చరు వచ్చింది," అన్నాడు మదన్ ఆ రోజు ఇంకోగంటకి ఆఫీసవబోతుందనగా!

"ఇంటికెళ్ళి వంటచేసుకోవాలి. టైముంటుందో ఉండదో!"

"ఇంట్లో మీరొక్కరే వుంటారా ?"

"అవును."

ఆ మాట వినగానే చాలా సంతోషం కలిగింది మదన్‌కి.

"హోటల్లో భోజనంచేసి వచ్చేద్దాం! ఏకంగా ఇంటికి వచ్చి పడుకోవచ్చు,"

సరేనన్నట్లు తలూపింది సత్యవతి.

ఆరుగంటలకల్లా థియేటరు దగ్గర కలుసుకున్నారు ఇద్దరూ.

ఫుడ్‌కార్పొరేషన్‌లో పని వుండి వచ్చిన చక్రపాణి స్నేహితునితో కలిసి సినిమాకి వచ్చి గేట్లో టిక్కెట్టిచ్చి లోప లికి వస్తున్న ఇద్దరినీ చూసాడు. చాలా

త్వరగానే ఆమెని గుర్తించాడు కూడు. పై వరుసలో కూర్చున్న చక్రపాణిని చీకటిలో గమనించలేదు సత్యవతి.

అయితే సత్యవతికూడా మళ్ళీ పెళ్ళి చేసుకుందన్నమాట. అబ్బాయి మంచి షోకిల్లాలా వున్నాడు. ఆమెకి అన్ని విధాలా సరిపోతాడు అనుకుని నవ్వుకున్నాడు.

ఆప్రయత్నంగానే పద్మజ, పిల్లలు గుర్తుకి వచ్చారు.

సత్యవతి ఊహే భరించలేని పద్మ ఇలా థియేటరులో ఆమెని చూసి గుర్తించానంటే ఏమయిపోతుంది! వద్దు! తనామెకి ఏ విధంగానూ కష్టం కలిగించ కూడదు. సినిమా చూడకుండా ముందు వరుసలో కూర్చున్న సత్యవతి. మదన్‌ల చిలిపిచూపులు, చిరునవ్వులు, కబుర్లు అన్నీ గమనిస్తూనేవున్నాడు వెనకనించి చక్రపాణి. పదినిమిషాలలా చూసి తను సినిమా చూడటంలో నిమగ్నమయి పోయాడు. మళ్ళీ సత్యవతినిగాని, మదన్‌ని గాని చూడదల్చుకోలేదు.

సినిమా ఇంకా పదినిముషాలుండగానే వాళ్ళిద్దరూ బయటికి వెళ్ళిపోయారు. అప్పటికి తృప్తిగా గాలి పీల్చుకున్నాడు చక్రపాణి.

## 9

ఆ మర్నాడు ఉదయం ఇల్లు చేరాక పిల్లలిద్దరినీ దగ్గర కూర్చోబెట్టుకుని ఆడించసాగాడు చక్రపాణి.

"ఒరేయ్! పద్మజకి అప్పుడు జబ్బు చేసిన సమయంలో తిరుపతి వస్తానని దణ్ణంపెట్టాను. మీరిద్దరూ వెళ్ళి దర్శనం చేసుకునిరండి." అంది సూరమ్మ గోంగూర ఏరుతూ.

"బి.ఏ. పరీక్షలవగానే వెడతాం లెండి." అంది పద్మజ అత్తగారికీ చేట అందిస్తూ.

"అవునమ్మా! ఆ డిగ్రీకూడా వచ్చేస్తే స్వామి దర్శనం చేసుకుని, అటు ఏకంగా కంచికాళహస్తి అన్నీ చూసి వస్తాము."

"అయినా మేమిద్దరమే ఒంటరిగా ఎందుకు? మీరందరూ కూడా వస్తే అంతా చూడవచ్చుగదా," అంది పద్మజ.

ఆ మాటకి సంబరపడుతూ "నిజమేనే తల్లీ! అంతాకలిసి వెళ్ళివద్దాం ఓ వారం పాటు, మీ మామగారికి కూడా చెబుతాను. ఎప్పుడూ పొలాలు, ఇల్లు తప్ప మరో ధ్యాస లేదు ఇంట్లో ఎవరికీని," అంది సూరమ్మ.

"ఈలోగా మరో ఇద్దరు పుట్టుకొస్తారు పద్మజకి," అంటూ నవ్వింది జయలక్ష్మి.

"పోనీలెద్దూ! ఆ భగవంతుడు ఇస్తే వద్దంటామా! ఎంతమంది పుట్టినా అందరినీ తీసుకునే వెడతాము. కలో, గంజో పోసి పెంచుకుంటాంగాని పారేసుకోంగదా! నీకు మగపిల్లాడిమీద

భ్రాంతిగా వుంది. పద్మజ చిన్నకొడుకు సోమశేఖర్‌ని సాకుతూవుండు. కొడుకు పుడతాడు." అని సలహాయిచ్చింది, సూరమ్మ.

అలాగేనన్నట్టు తల వూపింది. అది మొదలు సోమంపని అంతా జయలక్ష్మి చేస్తుండేది.

శ్రీనివాస్‌తో సూరమ్మ కాలక్షేపం చేయడంతో పిల్లల బాధ్యత కాస్త తప్పి భర్త చదువుకే ప్రాధాన్యత నివ్వసాగింది పద్మజ.

"నువ్వుకూడా ఇంటరు పాస య్యావుగదా ! బి.ఏ. కి కట్టు ఇద్దరమూ చదువుకోవచ్చు," అన్నాడు చక్రపాణి.

"నిజంగానే బి. ఏ. పాసవ్వాలని వుందా! మీకిష్టం అయితే కడతాను. లేక పోతే నాకూ అంతగా చదవాలని లేదు. అత్తయ్యగారు పెద్దవారవుతున్నారు. పనులెక్కువగా చేసుకోలేరు. ఆవిడకి సాయంగా లేకపోతే ఎలా !"

చక్రపాణి నవ్వుతూ భార్యని దగ్గ రకి తీసుకుని "అచ్చం గృహిణిలానే మాట్లాడావు. పనులతో, పిల్లలతో నీకు చదవడానికి వీలుండదు. వూరికే అన్నా నులే ! నువ్వు చదివిన ఈ చదువు చాలు," అన్నాడు.

"పైగా మీరు ప్రక్కనుంటే నాకు అక్షరం బుర్రకెక్కదు," కొంటెగా అంది.

"అలాగా ! నువ్వు ప్రక్కన లేందే అక్షరం నా బుర్రకెక్కదు." ఆమె పెదవులమీద గాఢంగా ముద్దుపెట్టు కుంటూ అన్నాడు.

"నేను మీ ప్రక్కన లేకుండా ఎక్క డికీ పోవడంలేదుగా !"

"వద్దు పద్మా ! ఎక్కడికీ వెళ్ళొద్దు. నువ్వు లేకపోతే ఈ ఇల్లు, నా హృదయం అంతా తిమిరావృతమై దిక్కుతోచక అలమటించిపోతాను. నా తనువులో, హృదయంలో, అణువణు వులో నీ మీది అనురాగం పొంగి పరవళ్లు త్రొక్కుతూ ఉంటే నా జీవన జ్యోతివైన నువ్వు లిప్తకాలం కనుమరు గయినా భరించలేను. బ్రతకలేను."

"పోనీలెండి ! ప్రేమనేది ఎలాం టిదో ఇప్పటికైనా మీరు గ్రహించారు. ఆనాడు మీ ప్రేమ నాపట్ల కరువయిం దేమోననే వేదనతో ఆత్మహత్య చేసు కుందామనుకున్నాను. మీరు లేచి ఉండక పోతే ఇప్పటికి నేను మరణించి మూడేళ్ళయిపోయి ఉండేది."

చటుక్కున ఆమె నోరు మూసి, "నా పుణ్యం అంటూ ఏదన్నా క్రిందటి జన్మలోనో, ఈ జన్మలోనో చేసుకుని ఉన్నా ననడానికి ఆనాడు నిన్ను వెళ్ళ నీయకుండా ఆపగల తెలివితో ఉండ టమే నిదర్శనం. కోటి జన్మలకైనా నాకు నువ్వే అర్థాంగివి కావాలి. అదే నా కోరిక."

భర్త అనురాగానికి పులకించి

పోయింది పద్మజ. "అర్థంచేసుకోగల సహృదయుడు సౌజన్యవంతుడైన భర్త దొరకడం ఎన్ని వేల సంవత్సరాల తపస్సు పుణ్యమో ! నా కీయన అను రాగభాగ్యంలోనే ఆఖరి శ్వాస ముగియనీ ! అంతకుమించి నేను కోరే మహదైశ్వర్యాలేమీ లేవు" అని మన స్సులోనే అంజలి ఘటించింది భగవం తునికి.

* * *

ఉదయం పదిగంటలకి ఆఫీసు మొదలు కనుక 9-30 కల్లా బయలు దేరుతుంది సత్యవతి. ఆనాడు తా మిరు వురూ కలిసి సినిమాకి వెళ్ళి వచ్చాక మరింత చేరువయ్యాడు మదన్ ఆమె హృదయానికి.

"ఎలాగైనా అతను త్వరగా పెళ్ళి ప్రస్తావన తెస్తే బాగుండు" నని రోజూ అనుకుంటూ అలా తేవాలని భగవం తునికి దణ్ణంపెట్టి మరీ ఆఫీసుకు బయలుదేరింది.

మధ్యదారిలో ఎదురుపడ్డాడు మదన్.

"ఏమిటిలా వస్తున్నారు ?" అంది చిరునవ్వుతో.

"మీ కోసమే ! అబ్బ ! ఈ గులాబిరంగు సిల్కు చీరలో ఎంత అందంగా ఉన్నారు ?" అన్నాడు సంతోషంగా.

ఆ మాటలకి పులకించిపోయింది సత్యవతి.

"మీరు ఊరికే పొగుడుతున్నారు గాని నేను అంత అందంగా ఉన్నానా ?" తల దించుకుంటూ అడిగింది.

"అందంగా ఉన్నావో చూపించ డానికి ఇది రోడ్డయిపోయింది. ఇదే ఇల్లయితేనా ?" చిలిపిగా అన్నాడు మదన్.

ఆ మాటకి ఝల్లుమంది సత్యవతి గుండె.

"అబ్బ ! ఇతనూ తనను ప్రేమిస్తు న్నాడు. భగవంతుడా ! నా కోరిక త్వరగా నెరవేర్చు, ఇతని మనసు మారిపోకుండా." మనసులోనే దణ్ణం పెట్టింది.

"కాస్త కాఫీ త్రాగుదాం రా రాదూ ?"

"ఇప్పుడేం కాఫీ ? ఇప్పుడే భోజనం చేసి వస్తుంటేను."

"సరే ! మధ్యాహ్నం దాకా ఆగా లన్న మాట."

"ఏం ఆగలేరా ?"

"నా కయితే ఆగాలని లేదుగాని, అభ్యంతరం నీ వైపునించి వచ్చింది కనుక నీ మాటకి తలవంచి ఆగు తున్నాను."

"మంచిపని చేస్తున్నారు. నడవండి" అంది ఓరగా అతనికేసి చూసి.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ ఆఫీసు చేరుకున్నారు. సత్యవతి ఆఫీసులో మద న్‌తో తప్ప మరెవరితోనూ మాట్లాడదు.

వారిద్దరూ కలిసి కాఫీహోటళ్ళకి వెళ్ళడం, కలిసి రావడం అన్నీ చూస్తూ గుసగుసలు పోసాగారంతా.

కర్ణాకర్ణిగా విన్నా సత్యవతి లక్ష్య పెట్టలేదు. "రేపో మాపో పెళ్ళిచేసుకుంటే అందరి నోళ్ళూ మూతబడతాయి" అని నిర్లక్ష్యంగా ఊరుకుంది.

ఆ రోజు కాస్త తల భారంగా ఉంటే ఆఫీసుకు వెళ్ళలేదు సత్యవతి.

లంచ్ అవర్లో పరుగెత్తుకుంటూ వచ్చాడు మదన్ సత్యవతి ఇంటికి.

"ఏం సత్యా ! ఆఫీసుకు రాలేదేం ?" అనడిగాడు ఆదుర్దాగా.

"ఒంట్లో బాగుండక రాలేదు."

"మందు వేసుకున్నావా ? అలాగే పడుకున్నావా ? జ్వరంకూడా తగిలిందా ?" అంటూ ఆమె నుదుట చెయ్యి వేసి చూసాడు.

తనే హోటల్‌నించి కాఫీ, మందు బిళ్ళ తీసుకువచ్చి, ఆమెచేత మందు మింగించి కాఫీ త్రాగించాడు.

"నువ్వు ఆఫీసుకు రాకపోతే మతిపోయినట్లయింది సత్యా ! ఇక్కడికి వచ్చి చూసేదాకా నా మనసులో మనసు లేదు" అన్నాడు ప్రక్కనే కుర్చీలో కూర్చుంటూ."

"నేనంటే మీ కెందుకంత ప్రేమ ?"

"ఎందుకా ! అంటే ఏం చెప్పను ? ఒక్కో మనిషిని చూస్తూ ఉంటే ఆ మనిషికోసం ఏ త్యాగమయినా చేసి ఆ మనిషిని పొందాలని, ఆమెకోసం ప్రాణం అయినా విడవాలని అనిపిస్తుంది. ఆ వ్యక్తి కనబడకపోతే ప్రాణం నిలువునా పోయినట్లు ఉంటుంది !

మనిషికి మనిషిని జతచేసి భగవంతుడే పంపుతాడీ భూమిపైకి అనడానికి ఇంతకంటే తార్కాణం ఏమి ఉంది ? నిన్ను చూడకపోతే నువ్వు లేకపోతే నేను బ్రతకలేను." దిగులుగా అన్నాడు మదన్.

"అంత నన్ను చూడకుండా ఉండలేననుకుంటే మూడు ముళ్ళూ వేసి మీ స్వంతం చేసుకోవచ్చును గదా !"

"నిజమే ! నాకు నిన్ను పెళ్ళి చేసుకోవాలనే ఉంది. నువ్వేమంటావో నన్న భయంతో ఊరుకుంటున్నాను."

"భయం దేనికి ? మీలాంటి హృదయమున్న వ్యక్తి పెళ్ళాడతానని ముందుకు వస్తే ఏ యువతి కాదంటుంది ?"

"నిజం ! నిజంగానే అంటున్నావా సత్యా ! నా కంతటి అదృష్టం కలిగిస్తావా?" ఉప్పొంగిపోయే హృదయంతో అడిగాడు మదన్.

"అదృష్టం మీదికాదు, నాది ! మీ అర్థాంగి నవడంకన్నా మించిన భాగ్యం మరొకటి లేదు."

చటుక్కున కుర్చీలోంచి లేచి

ఆమెని హృదయానికి హత్తుకుని బుగ్గలు రెండూ ముద్దుపెట్టుకున్నాడు మదన్.

అతని పరిష్వంగనలో మైమరచి పోయింది సత్యవతి.

"నా సత్యా ! నా వలపుల రాణీ ! నా జన్మ తరించిపోయింది. సాధ్యమయినంత వేగంగా మనం పెళ్ళిచేసుకుని ఆనందలోకాల్లో తనివితీరా విహరిద్దాము." పదే పదే ఆమె ముఖాన్ని ముద్దులతో ముంచివేస్తూ ఆవేశంగా అన్నాడు మదన్. పరమానందంతో వూపింది సత్యవతి.

ఆ మర్నాడే ఇంటికి ఉత్తరం రాసింది సత్యవతి. తను పెళ్ళిచేసుకుంటున్నట్టు. మూడోనాటికల్లా తల్లీ దండ్రీ అంతా వచ్చారు.

మదన్‌ని ఆ సాయంత్రం ఇంటికి తీసుకువచ్చి చూపించింది సత్యవతి.

చలాకీగా ఉన్న అల్లుడిని చూసి ముచ్చటపడ్డారు రామయ్య, కనకమ్మాను.

ఒకసారి పెళ్ళయి రద్దుచేసుకున్న పిల్ల కనుక ఆర్భాటం చేస్తే అది కాస్తా ఎక్కడ బయటపడుతుందోనని ఆట్టే ఎవర్నీ పిలవలేదు రామయ్య.

మదన్‌వైపు కూడా బంధువు లెవరూ రాలేదు. తనకు బంధువులంటూ ఎవరూ లేరని, ఉన్నవాళ్ళు విసిరేసినట్లు ఎక్కడో ఉన్నారని వాళ్ళందర్నీ పిలిపించడానికి టైములేదని, పిలిచినా రైలు ఖర్చులు పెట్టుకుని వచ్చేవారు ఎవరూ ఉండరని, చెప్పాడు మదన్. అతనివైపు పదిమంది స్నేహితులే వచ్చారు

పెళ్ళి సింపుల్‌గా జరిగిపోయింది.

ఎటూ ప్రేమ వివాహమే గనుక వేరే మూడు నిద్రలూ అవీ అంటూ ఏం వద్దని అన్నాడు మదన్. ఆ రాత్రే శోభనంకూడా నిర్ణయించేసారు.

తనకి నచ్చే విధంగా తనే అలంకరించుకుంది ఆ గదిని సత్యవతి. స్వీట్సు అవీ అన్నీ సర్ది కూతుర్ని, అల్లుడిని గదిలోకి పంపి అనసూయ ఇంటికి వెళ్ళిపోయారు రామయ్య, కనకమ్మాను.


తెల్లని గ్లాస్కో లాల్చీ, పైజమాలలో అచ్చు సినిమా హీరోలా కనిపించాడు సత్యవతికి మదన్‌మోహన్.

"అమ్మయ్య ! నా నిరీక్షణ ఫలించింది" అంటూ ఆమెని గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు మదన్.

తన జన్మ ధన్యమైందని భావించింది సత్యవతి.

ఆ రాత్రి నవదంపతులు శృంగార సీమలో విహరించి, ఏ తెల్లవారుజామునకో నిద్రపోయారు.

బాగా తెల్లవారాక వచ్చిన కనకమ్మ కూతురి ముఖంలో వెల్లివిరుస్తున్న సంతోష తరంగాలను చూసి తృప్తిగా నిట్టూర్చింది. నా కూతురికి ఒక అండ, తోడు దొరికాయి. ఇన్నాళ్ళూ ఇలా ఒంటరిగా పడిఉందే అని బాధపడుతూ,




దిగులుపడుతూ కాలం వెళ్ళదీయక్కర్లేదు. అది సుఖపడుతుంది అంతే చాలు అనుకుంది మనసులో.

ఆ రోజు ఆఫీసుకు సెలవు పెట్టింది. ఆ రోజేకాదు మరో మూడురోజుల వరకూ సెలవు పెట్టింది సత్యవతి.

భర్త పరిష్వంగనలో ఆమెకి కాలమే తెలియడంలేదు.

"మళ్ళీ డ్యూటీలో చేరు సత్యా !" అన్నాడు మదన్.

అలాగే నన్నట్లు తల వూపింది.

"నేను నాలుగున్నర సంవత్సరాల నించీ పనిచేస్తున్నా ప్రమోషన్ రావడం, జీతం పెరగడం ఏమీ లేదు. ఎక్కడున్నావే గొంగళీ అంటే వేసిన చోటే ఉన్నా నన్నట్లుంది నా స్థితి. ఏదన్నా కాస్త ఆర్థికంగా వెసులుబాటుంటే నువ్వుమానేయొచ్చు. అందాకా చేయక తప్పదు. మరి మనకొచ్చే జీతాలు చాలిచావవుగదా !"

నిజమే నన్నట్లు తల వూపింది సత్యవతి.

ఆ మర్నాడే డ్యూటీలో చేరింది తిరిగి.

మదన్ సత్యవతి గదిలోనే ఉంటున్నాడు బట్టలుమాత్రం తెచ్చుకుని.

"కాస్త పెద్ద ఇల్లు దొరకగానే అక్కడున్న సామాన్లు తెద్దాం. ఇదీ ఒక్కటే గదికదా !" అన్నాడు.

నిజమే నన్నట్టు తల పంకించి వూరుకుంది సత్యవతి.

సత్యవతి, మదన్‌లు కాపురం ప్రారంభించి నెల అయింది. వస్తూ మందు బిళ్ళలు తెచ్చాడు మదన్.

"అవెందుకు ?'' అనడిగింది ఆశ్చ ర్యంగా సత్యవతి.

"ఇవి వేసుకుంటే కొన్నాళ్ళవరకూ గర్భం రాదు. ఇప్పటినించీ పిల్లలు పుట్టడం మొదలైతే మనకి ఆనందం ఏముంటుంది? నా కింకా నీ యవ్వనం, సౌందర్యం ఎంత గ్రోలుతున్నా తనివి తీరడంలేదు. అవన్నీ చెడగొట్టుకుని పిల్లల తల్లివై ఈసురోమంటూ ఉంటే ఏం బాగుంటుంది ?"

నిజమే ననిపించింది సత్యవతికి కూడా. కనీసం ఏడాది రెండేళ్ల పాట యినా తను ఈ దాంపత్యానందాన్ని అనుభవించాలి. డబ్బు సంపాదించాలి. ఇవన్నీ ఒనగూడాక అప్పుడు ఆలో చించవచ్చు పిల్లల సంగతి. వెధవ పిల్లలతో చాకిరీయే సరిపోతుంది. సుఖమా పాడా ! అని మనసులో అనుకుంది.

మరో పదిరోజులు గడిచాక "నేను మా స్వ గామం వెళ్ళి రావాలి. దాయా దుల గొడవల్లో మా పొలం చిక్కుకుని ఉంది. దాని సంగతి పట్టించుకోవడం మానేసాను. ఇప్పుడు పెళ్లి చేసు కున్నాను. ఆ తర్వాత పిల్లలు పుడ తారు. వెనక బ్రహ్మచారిని గనుక ఏదో సరిపోయింది. ఎవరో ఒకరు తింటారులే అనుకున్నాను. ఇప్పుడింక వూరుకో దలుచుకోలేదు. సంవత్సరానికి సరిపడ బియ్యం అన్నా మనకి వచ్చే ఏర్పాటు చేసుకోవాలి" అంటూ బట్టలు సర్దుకో సాగాడు మదన్.

"మళ్ళీ ఎన్నాళ్ళల్లో వస్తారు ?" దిగులుగా అడిగింది సత్యవతి.

"ఎంత ? ఓ వారం అనుకున్నాను! సాధ్యమయినంత వేగంగానే. ఈలోగానే రావడానికి ప్రయత్నిస్తాను" అంటూ సత్యవతిని దగ్గరకు తీసుకున్నాడు.

"ప్రథమ వియోగం బాధాకరమే అయినా తప్పదు మరి.'' అంటూ రెండు బుగ్గలూ ముద్దుపెట్టుకున్నాడు.

కన్నీళ్ళతో వీడ్కోలిచ్చింది సత్యవతి.

## 10

మదన్ దగ్గరనించి ఉత్తరం అందే దాకా ఆమెకు అన్నం సహించలేదు. అనుక్షణమూ ఆమెకి భర్త తలపులే జ్ఞప్తికి వస్తుంటే మళ్ళీ ఎప్పుడెప్పుడు అతను వస్తాడా అన్న తపన ఎక్కు వయింది ఆమెలో.

అతని దగ్గరనించి వచ్చిన ఉత్త రాన్ని తనివితీరా ముద్దుపెట్టుకుంది. పదిసార్లు చదువుకుంది.

"సత్యా ! డియర్ !

అబ్బ ! నిన్ను విడిచి వచ్చానేగాని నా మనసుమాత్రం అక్కడే ఉంది. రాత్రిళ్లు అసలు బొత్తిగా నిద్రపట్టడం లేదు. నీ కౌగిలి, నీ విచ్చే సుఖమూ అన్నీ గుర్తుకు వచ్చి ఇక్కడనించి రెక్కలు కట్టుకుని వాలుదామా అని

తహతహ లాడిపోతోంది మనస్సు. కాని ఏం చేయను ? నీమీది ప్రేమ ఒక్కటే జీవితం గడపడానికి సరిపోదుకదా ! తిండి, బట్ట అన్నీ ఏర్పరచుకుంటూ వాటికి లోటులేకుండా చూసుకుంటూ ఉంటే ఈ అనురాగమంతా నిత్యనూతనంగా ఉంటూ మనకి ఆనందానందాన్ని ఇస్తుంది. కాలే కడుపుతో, తీరని కోరికలతో చేసే సంసారంలో శృంగారానందాలుమాత్రం ఎందాకా నిలుస్తాయి ? ఏం అనుభవిస్తాము ? అందుకే నేనిన్ని సంవత్సరాలకి మా వూరు వెళ్ళాల్సి వచ్చింది—నాలుగయిదు రోజుల్లో వచ్చేస్తాను. నీకూ అలాగే ఉంటుంది నేను లేకపోతే; అని నాకు తెలుసు ! ఏంచేయను? మదనాగ్నికి గురి చేసి నిన్ను నే నీవూరు వచ్చినందుకు పరిహారంగా నేను వూరినించి వచ్చాక సెలవు పెట్టుకుని ఇద్దరమూ పగలూ, రాత్రికూడా రాత్రిలానే భావించి ఆనందిద్దాము.

నీ

మదన్"

శృంగారాన్ని, ప్రేమని రంగరించి రాసిన మదన్ ఉత్తరాన్ని పదకొండోసారి చదువుకుని మనసారా నవ్వుకుంది. అతని రసికతకి ఆమె తనువు నిలువెల్లా పులకరించింది. ఆనందంతో మైమరచిపోయింది. అడ్రసు రాయలేదు. బహుశా మరిచిపోయి ఉంటాడు 'వట్టి కంగారు మనిషి' అని నవ్వుకుంది సత్యవతి మరోసారి.

వారంరోజులకల్లా తిరిగి వచ్చాడు మదన్.

అతన్ని చూసేసరికి ప్రాణంలేచి వచ్చింది సత్యవతికి. ''అబ్బ ! ఎన్ని యుగాలో అయినట్టు ఉంది" రాగానే సత్యని గట్టిగా కౌగిలించుకుంటూ అన్నాడు మదన్.

''ఇంతకీ వెళ్ళిన పనులు అయినట్లేనా ?"

"అప్పుడేనా ! అంత త్వరగా అయిపోతే ఇంక లేనిదేముంది ? కొన్నాళ్ళు పోయాక మళ్ళీ వెళ్ళాల్సి ఉంటుంది."

"సరే ! ఇప్పుడప్పుడే కాదుగదా ! అని సరిపెట్టుకుంది సత్యవతి.

నాలుగురోజులు గడిచిపోయాయి. జీతాలు పుచ్చుకుని ఇంటికి వచ్చారు దంపతులు.

''మీ జీతం రెండువందలయాభై, నా జీతం నూటయాభై మొత్తం నాలుగు వందలు అయిందికదా ! మూడు వందిలతో కాస్త పెద్ద ఇల్లు తీసుకున్నా మనకి గడిచిపోతుంది అలా గడుపుకుంటూ ఓ వంద బ్యాంకిలో వేసుకుంటే మనకి నయంగదా !" అంది సత్యవతి.

"బాగానే ఉందనుకో ! కాని నాకు 250 చేతికి రావడంలేదుగదా ! అవీ ఇవీ కట్ చేసుకుని రెండొందలలో, రెండొందల అయిదో గదా చేతికిచ్చేది.

అందుకేగా నేను ప్రమోషనో అని ఏడుస్తున్నది." దిగులుగా అన్నాడు మదన్.

సత్యవతి జాలిపడింది. "పోనీయండి. అది వచ్చినప్పటికే వస్తుంది." అని తన జీతం ఓ పాతిక ఉంచుకుని మిగిలింది భర్తకే ఇచ్చింది.

అది తన జీతంతో కలిపేసి సంసారానికి కావలసినవన్నీ తనే తెచ్చి పడేసాడు మదన్.

"నేను ఇంటరు ఇంకా రెండు సబ్జక్ట్సు పాసవ్వాలి. పరీక్షకి కడుతున్నాను" అంది సత్యవతి.

"వెళ్ళు! కంప్లీట్ అయితే ప్రయివేటుగా బి. ఏ. కి కట్టవచ్చు. శుభ్రంగా డిగ్రీ వస్తుంది." ఉత్సాహంగా అన్నాడు మదన్.

తన కోరికల కనుగుణంగా తన ఇష్టానుసారమే అన్నీ జరగడానికి దోహదమిస్తున్న భర్త అంటే విపరీతమైన గౌరవం కలిగింది సత్యవతికి.

అనుకున్నట్టుగానే సత్యవతి ఆ రెండు సబ్జక్ట్సు పరీక్ష రాసి వచ్చింది.

సత్యవతి కొత్తకాపురంలో తొమ్మిది నెలలు కులాసాగా గడిచిపోయాయి. "ఇదే మా యిల్లు. రండి" అంటూ ఆహ్వానించాడు మదన్ ఆ కంపెనీ మేనేజరును.

అప్పటికి వెకక ఉంటున్న గది ఖాళీచేసి కొత్త ఇంట్లోకి ప్రవేశించి మూడు నెలలయింది.

ఇది మూడు గదులున్న ప్రత్యేక వాటా. గాలీ, వెలుతురూ కూడా బాగానే వస్తుంది. అన్నీ బాగున్నాయని వంద రూపాయలు తమ శక్తికి మించినదని సత్యవతి అన్నా ప్రవేశించాడు మదన్. తన ఫాను, అవీ తెచ్చిపెట్టాడు మదన్. ఇల్లు చక్కగా, నీట్‌గా ఉంది.

మేనేజర్ సుకుమార్ కుర్చీలో కూర్చున్నాక "సత్యా! కాఫీ తీసుకురా!" అంటూ కేకేసాడు భార్యని.

చక్కగా ముస్తాబయి రెండు కప్పులతో కాఫీ తెచ్చింది సత్యవతి.

తన ఫ్రెండ్స్ ఎవరు వచ్చినా తను నీట్‌గా, అందంగా కనిపించాలని భర్తగారు వేసిన ఆర్డరు గుర్తుంచుకుని క్షణాలమీద తయారై వచ్చింది సత్యవతి.

"ఈమె మన ఆఫీసులో పనిచేయడం ప్రారంభించాకే మా వివాహం జరిగింది. ఆ సంగతి మీకూ తెలుసుననుకుంటాను," అంటూ మందహాసం చేశాడు మదన్.

"యస్. యస్. అప్పుడు ఎవరో అనగా విన్నాను," అన్నాడు సుకుమార్.

సత్యవతి నమస్కరించి అక్కడే ఉన్న మరో కుర్చీలో కూర్చుంది.

ఆ కబురూ, ఈ కబురూ చెప్పి వెళ్ళి

వస్తానంటూ లేచాడు సుకుమార్. అప్పటికి టైము ఎనిమిది అయింది.

"ఈ రోజు ఈయన ఇంత తీరుబడిగా కూర్చున్నాడేం ?" అంటూ వంటింట్లోకి దారితీసింది సత్యవతి.

"ఆ ! ఏదో ! కాస్త కబుర్లు చెబితే ఏమన్నా ప్రమోషన్ ఇస్తానంటాడేమో నని నా ఆశ," అంటూ భోజనానికి కూర్చున్నాడు మదన్.

"ఇంకా మీకీ ప్రమోషన్ బెంగ తగ్గలేదన్నమాట" అంటూ నవ్వింది సత్యవతి.

"ఎలా తగ్గుతుంది రాకపోతూంటే" అంటూ తను కూడా నవ్వాడు మదన్. అడపా దడపా స్వగ్రామం అంటూ బయలుదేరుతూనే ఉన్నాడు మదన్.

పదిహేనురోజులకి, నెలకి, ఒకోసారి పదిరోజులకి కూడా

వెళ్ళినప్పుడల్లా నెలకి వెడితే వారం, పదిహేనురోజులకయితే నాలుగు, పదిరోజులకయితే ఒకరోజు శనివారం రాత్రికి బయలుదేరి సోమవారానికి వస్తూ కొన్నాళ్ళు ఇలా గడుపుతూ ఉంటే క్రమంగా సత్యవతికి అలవాటయి పోయింది

ఆనాడు పరిచయమైన తర్వాత అడపా దడపా ఇంటికి వచ్చి కబుర్లు చెబుతూనే ఉన్నాడు సుకుమార్. భర్త కోరిక తెలుసు కనుక తనుకూడా జాగ్రత్తగా మర్యాదల కేమీ లోపం కలుగకుండా చూసుకునేది సత్యవతి.

ఆ రోజు స్వగ్రామం వెళ్ళాడు మదన్. సాయంత్రం ఏడు దాటింది. భర్త లేడు కనుక పెందలాడే భోజనానికి కూర్చుంది సత్యవతి.

తలుపుతట్టినశబ్దానికిభోజనంమధ్యలో ఆపి లేచివచ్చి తలుపు తీసింది సత్యవతి. వేళగాని వేళ వచ్చిన సుకుమార్ని చూచి మనసులోనే విసుక్కుంది సత్య. పైకిదాన్ని కప్పిపుచ్చుకుంటూ రాని నవ్వు పులుముకుని "ఆయన ఊరు వెళ్ళారు. వక్కత్తినే గదాని భోజనం చేస్తున్నాను," అంటూ కుర్చీ జరిపింది, భర్త లేడని చెబితే వెళ్ళిపోకపోతాడా అనుకుంటూ.

"అరెరే ! భోజనం చేస్తున్నావా ! సరే పూర్తిచేసిరా ! నే నిక్కడే ఉంటాను. నీతో ఒక విషయం చెప్పాలని వచ్చాను," అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

ఒక విషయం అంటే బహుశ భర్త కేమన్నా ప్రమోషన్ ఇస్తున్నట్లు చెప్పాలని వచ్చాడేమో !" అనుకుంటూ గబగబా భోజనం ముగించి వచ్చింది.

సుకుమార్ తలుపు గడియ వేసి కుర్చీలో కూర్చుని పత్రిక తిరగేస్తున్నాడు. అతను తలుపు గడియ వేసి కూర్చున్న పద్ధతి చూస్తే కాస్త భయంవేసింది సత్యవతికి.

"భోజనం పూర్తయిందా ?" ఆప్యా

యత ఉట్టిపడుతూన్నట్టు అడిగాడు సుకుమార్.

"అయిందన్నట్లు" తల ఊపింది కాఫీ కప్పు అందించి.

"అప్పుడే కాఫీకూడా తెచ్చావే" అంటూ కప్పు అందుకుని మెల్లగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. అనుకోని ఈ చర్యకి సత్యవతి హడలి పోయింది. మరు నిమిషంలో అతని బాహువులు ఆమెని చుట్టివేశాయి.

"ప్లీజ్ ! వదలండి ! నే నలాంటి దాన్నికాను." ఆయనకి తెలిస్తే నా సంసారం నాశనమవుతుంది" అంది కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ

"సిల్లీగా మాట్లాడకు. అతని కెలా తెలుస్తుంది ? తెలిసినా ఫర్వాలేదు. అత నేమీ అనుకోడు. అతనికి ఇష్టమే ! లేకపోతే నన్ను ఇంటికి తెచ్చి ఎందుకు పరిచయం చేస్తాడనుకున్నావు?" అంటూ ఆమెని గాఢంగా చుంబించాడు రెండు బుగ్గలపైనా.

ఎంత ప్రయత్నించినా ఆ ఉక్కు-హస్తాలనించి తప్పించుకోలేకపోయింది సత్యవతి అత డామెని మంచంమీదకి త్రోసి ఆమె నాక్రమించుకున్నాడు. ఎంత ప్రతిఘటించినా లాభంలేక అలసి పోయిన ఆమె శరీరం అతనికి పూర్తిగా లొంగిపోయింది. సుకుమార్ తెల్లవారు జామువరకూ ఆమె దగ్గరే గడిపాడు. ఆమె సర్వాంగాలూ తనివితీరా స్పృశించి, అనుభవించి అప్పటికి చాలించి వెళ్ళిపోయాడు ఇంటికి.

ఆ రోజంతా కుళ్ళి కుళ్ళి ఏడుస్తూనే ఉంది సత్యవతి. ఆఫీసుకు వెళ్ళలేదు. భర్త వచ్చి తన నెంత హీనంగా చూస్తాడో అన్న భయం, తనని వదిలి వెళ్ళిపోతాడేమోనన్న శంక, ఆ విషయం అతని కెలా చెప్పుకోవాలి ? అన్న సంశయం, ముప్పిరిగొనగా అభోజనం గానే గడిపింది సత్యవతి.

భర్త ఆ రాత్రికి వస్తాడేమోనని ఎదురుచూసింది. కాని సుకుమార్ మాత్రం వచ్చి రాత్రి ఒంటిగంటదాకా ఆమె కిష్టంలేకపోయినా బలవంతంగానే అనుభవించి వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు వచ్చాడు మదన్.

మూర్తీభవించిన శోకదేవతలా ఉన్న సత్యవతిని చూసి "ఏం సత్యా! అలా ఉన్నావేం ?" అనడిగాడు కంగారుగా.

"నా జీవితం సర్వనాశనమైందండీ" అంటూ భోరున ఏడ్చింది.

"ఏం జరిగిందో చెప్పు ! ప్లీజ్ ! ఏడవకు," అంటూ ఆమె కళ్ళనీళ్ళు తుడిచాడు.

అతని లాలనకి మరింత ఏడుస్తూ "ఆ సుకుమార్ నా శరీరాన్ని కాంక్షించాడు." అంటూ వెక్కిళ్ళమధ్య భయపడుతూనే జరిగిందంతా చెప్పింది సత్యవతి.

"ఓస్ ! ఇంతేగదా !" అన్నాడు అంతా విని తేలిగ్గా.

"ఇంతేనా ! ఇదేమన్నా సామాన్య విషయమా !" తెల్లబోతూ అంది సత్య.

"సామాన్యంకాక సీరియస్‌గా ఎందుకు చూడాలి ?"

"భార్య మరో పురుషుని కన్నెత్తి చూస్తేనే, పరపురుషుని చూపులు ఆమెపై ప్రసరిస్తేనే మైలపడినట్లు భావించే మగవారున్న సంఘంలో భార్య శీలాన్ని అపహరిస్తే అది తేలికగా భావించడమా ?"

"అవన్నీ పూర్వకాలపు మాటలు. పాత చింతకాయపచ్చడి రోజులు పోతున్నాయి సత్యా! తెలిసో, తెలియకో ఏ విధంగా భార్య శీలం పోగొట్టుకున్నా భార్యని యధావిధిగా ఆదరించగలిగే మగవారు, విశాలహృదయులు అనేక మంది ఉన్నారు. వారిలా ఉండటానికి ప్రయత్నిస్తాను నేను. సంకుచితంతో భార్యని అవమాన పరచలేను."

"కావచ్చు ! ఆ విశాల హృదయం, మీకున్నా పరాభవించబడిన నా కెలా ఉంటుంది."

"ఏలుకునేవాడిని, భర్తని నాకు లేని బాధ నీ కెందుకు ? అవన్నీ మర్చిపో ! మన అనురాగాని కేమీ భంగం కలగదు." అన్నాడు ఆమెని గుండెల కదుముకుంటూ

సత్యవతి మౌనం వహించింది.

ఆ మర్నాడు ఆఫీసుకు వెళ్ళగానే అసిస్టెంట్ మేనేజర్‌గా ప్రమోషన్ వచ్చినట్టు కాగితం అందించాడు మేనేజర్.

అది చదివాక ఆనందంతో మైమరచి పోయాడు మదన్. ఆఫీసు స్టాఫ్ కందరికీ పార్టీ ఇచ్చాడు. సాయంత్రం బజారునించి వస్తూ చీర కొని తెచ్చాడు సత్యవతికి.

భర్తకి ప్రమోషన్ వచ్చిందని తెలిసి ముభావంగానే ఉండిపోయింది సత్యవతి.

"సుకుమార్ నిన్నేదో అనుభవించి ద్రోహంచేసినట్లు ఫీలయ్యావు. ఇప్పుడు చూడు. నాకు అసిస్టెంట్ పదవి ఇచ్చి ప్రమోషన్ ఇచ్చాడో లేదో; నీకు నా ఆనందంకొద్దీ తెచ్చిన ఈ చీర ధరించి రా ! సినిమాకి పోదాం" అన్నాడు ఉత్సాహంగా.

సత్యవతి మౌనంగానే చీరకట్టుకుని భర్తతో కలిసి సినిమాకి వెళ్ళి వచ్చింది.

"భార్య శీలంతో సంపాదించిన ప్రమోషన్ గొప్పేనా ?" అనుకుంది మనసులో. అసలలా జరగాలనే సుకుమార్‌ని ఇంటికి ఆహ్వానించి రోజూ కబుర్లు చెప్పి ఈ విధంగా అవకాశం కలిగించడంకోసమే స్వగ్రామం అంటూ వెళ్ళిపోయాడని సత్యవతి ఊహించ లేదు. మదన్ అలా చేయగలడన్న యోచన రాలేదు. పొరపాటు జరిగినా భర్త తనని వదిలిపెట్టడం ఇష్టంలేకే ఆ విషయం మర్చిపోవాలని ఆశించాడని సత్యవతి అనుకుంది.

## 11

సెకండియర్ బి. ఏ. పరీక్ష రాసి వచ్చాడు చక్రపాణి సత్యవతి ఇంటరు ప్యాసై బి. ఏ. కి కట్టింది. చక్రపాణికి విద్యాతృష్ణ పెరిగినకొలదీ వ్యవసాయం పట్ల మరింత శ్రద్ధకలిగింది. తరచు దానికి సంబంధించిన పుస్తకాలు తెలుగు లోను, ఇంగ్లీషులోనూ తెలియని పదాలు డిక్షనరీ చూసుకుంటూ చదవడం ప్రారంభించాడు. ఆ వూరికి ప్రప్రథమంగా ట్రాక్టరు కొనుక్కుంది కూడా చక్రపాణే ! అధునాతన పద్ధతులలో తన పరిజ్ఞానమంతా ఉపయోగించి మేలురకం విత్తనాలన్నీ సేకరించి వేసి ఆ ఏడు ఆ ఊరి మొత్తంమీద అధిక పంట, అధిక రాబడి కళ్ళచూసాడు చక్రపాణి. ధాన్యలక్ష్మి ఇంటికి వచ్చిన రోజే పద్మజ ఒడిలో మరో బిడ్డ కేరుమన్నాడు.

పద్మజకి ఆసారీ మగపిల్లాడే పుట్టాడు. కామయ్యలో ఓపిక ఉడిగి పోయినా పట్టుపట్టి బారసాల వేడుకలు వైభవంగా జరిపించి "శ్రీకృష్ణ" అని పేరు పెట్టించాడు. ఆ ఏడే జయలక్ష్మికి మగపిల్లాడు కలిగాడు. "కళ్యాణ చక్రవర్తి" అని పేరు పెట్టుకున్నాడు చలపతి. అతని ఆనందానికి అవధులు లేవు కొడుకు పుట్టేసరికి.

ఒకవిధంగా చక్రపాణి జీవితంలో అన్నీ సాధించాడనే చెప్పాలి. అనుకూలవతి అయిన అర్ధాంగి, రత్నాల్లాంటి బిడ్డలు, పొరపొచ్చాలు లేని ఉమ్మడి కుటుంబం అన్నీ అతనికో విధమైన నిండుదనాన్ని ఇచ్చాయి. సత్యవతి అన్న పేరే అతని స్మృతి పథం నుంచి తొలగిపోయింది. సత్యవతికి అత నేనాడూ గుర్తు వచ్చి ఎరగడు.

* * *

"నేను వూరు వెడుతున్నాను సత్యా !" అన్నాడు మామూలుగానే మదన్.

"ఎందుకు శుద్ధదండుగ ! ఆ పొలం గొడవ తేలేనా పెట్టేనా ? ప్రతివారం డబ్బు తగలేసి వెళ్ళడమేగాని అది ఏమీ మనకి అక్కరకి రావడంలేదు." విసుగ్గా అంది సత్యవతి.

"అలా అనుకుని మానేస్తే ఎలా ? కొన్నాళ్ళలా శ్రమపడాలి, తప్పదు. అన్నీ మన చేతిలో వుంటాయా ? అవతల వ్యక్తులనుంచి రాబట్టుకోవాలంటే సహనమూ, నేర్పూ వుండాలి. ఇన్ని సంవత్సరాలు తినడానికి అలవాటుపడ్డ వాళ్ళు ఒక్కసారిగా ఎలా వదులుకుంటారు ?" నచ్చచెప్పే ధోరణిలో అన్నాడు మదన్.

సత్యవతి ఏమీ మాట్లాడలేదు. ఇది రెండేళ్ళనించీ జరుగుతున్న భాగోతమే ! అందుకే ఏమీ మాట్లాడలేదు. మదన్ వెళ్ళిపోయాడు.

ఇల్లు పెద్దదే. బాగానే వుంది.

మదన్ అసిస్టెంట్‌గా ప్రమోట్ అయ్యాడు. జీతం కూడా పెరిగింది. అయినా ఒక్క పైసా బ్యాంకిలో వేయడం పడలేదు. ఉన్నది తామిద్దరు.

జీతం అంతా తెచ్చి భర్త చేతిలో పోసి మెదలకుండా వూరుకుంటూ వుంటే భవిష్యత్తుకి ఎక్కడా దారి ఏర్పడటం లేదు అసలు అంత డబ్బు ఏమయి పోతోంది ? అతని డబ్బులో ఎంతైనా మిగల్చవచ్చు ఇప్పుడు. ఇంటి అద్దె వందపోతే మిగిలింది తన ఇంటికి ఏపాటి ఖర్చవుతోంది ? అని తీరుబడిగా లెక్కవేసుకుంటే మతిపోయింది సత్యవతికి. ఇంక లాభంలేదు. ఇంటి ఖర్చుల క్రింద యాభై తీసి భర్త కిచ్చి, మిగిలింది ఇకనైనా దాచు కోవాలి అన్న నిర్ణయానికి వచ్చింది సత్యవతి.

ఆ రోజు ప్రక్కింటామె వచ్చి 'సినిమాకు వెడదాం వస్తారా ?' అనడిగింది సత్యవతిని.

ఎలాగూ భర్త వూళ్ళో లేడుగదా, కాస్త కాలక్షేపం అవుతుంది అని అలాగే నన్నట్లు తల వూపింది సత్యవతి.

ఆ రోజు ఆదివారం కనుక మ్యాట్నీకే వెళ్ళి వచ్చేద్దామని సినిమాకి రెండు గంట లాటకే వెళ్ళారు సత్యవతి, ప్రక్కింటామె.

సినిమా వదిలారు. రిక్షా మాట్లాడు తోంది ప్రక్కింటామె. "నాన్నా ! సినిమా బాగుందికదూ !" అంటూన్న ఓ చిన్నపిల్లకంఠం, "అవును" అన్న జవాబు విని వెనుదిరిగి చూసింది. అలాగే కొయ్యబారిపోయింది.

మదన్‌మోహన్ ! అతని చెయ్యి పట్టుకుని ఓ ఆరేళ్ళపిల్ల, మరో చెయ్యి పట్టుకుని నాలుగేళ్ళ పిల్ల ! వెనుక చంటిపిల్లని ఎత్తుకుని వున్న ముప్పయి ఏళ్ళ ఆమె !

ఆమె మదన్‌మోహన్‌ని ఏదో అడగడం, అతను జవాబివ్వడం.

పిల్లల నిద్దరినీ ఒకవైపుకు మార్చుకుని, ఆమె భుజంమీద చెయ్యివేసి మెల్లగా నడిపించుకుని గేటు దాటించడం కళ్ళారా చూసిన సత్యవతి కాళ్ళక్రింద భూమి పగిలిపోతున్నట్లు, తనందులో కూరుకుపోతున్నట్లు అనిపించసాగింది. శరీరం తన అధీనం తప్పిపోయి ముచ్చెమటలుపోసి, కళ్ళు తిరగ సాగాయి.

"రండి ! రిక్షా కుదిరింది" అని ప్రక్కింటామె పిలవడంతో ఎలాగో నిలద్రొక్కుకుని మెల్లగా రిక్షా ఎక్కింది. ఎక్కి ఓసారి వెనక్కి చూసింది. అప్పుడే సరిగ్గా రిక్షా మాట్లాడుతూ మదన్‌మోహన్ ఆమెని చూసి స్థంభించిపోయాడు. తనని, తన కుటుంబాన్ని సత్యవతి ప్రత్యక్షంగా చూడటంతో ఎక్కడలేని వణుకూ వచ్చేసింది.


సత్యవతి మొహం తిప్పుకుని రిక్షాలో ఇంటికి వెళ్ళిపోయింది.

ఇల్లుచేరిన సత్యవతి తలుపు తాళం తీసుకుని లోపల మంచంమీద వాలి పోయి భోరున ఏడ్చేసింది. మదన్ ! ఎంత మోసంచేశాడు ? తన జీవితంతో ఎంత చెలగాట మాడాడు. ఇప్పుడర్థం అవుతోంది అతని వారాని కోసారి స్వగ్రామ ప్రయాణాల ఆంతర్యం ! డబ్బు ఎందుకు నిలవేయడానికి వీల్లేక పోతోందో, తనకి పిల్లలు కలగకుండా ఎందుకంత జాగ్రత్తపడ్డాడో అన్నీ ఒక్కటొక్కటిగా అర్థమయి ఆమెలో భీషణమైన తుఫాను రేగసాగింది. తన బ్రతుకింత అధ్వాన్నంగా దిగజారి పోయినందుకు కుళ్ళి కుళ్ళి ఏడ్చింది.

అన్నిటికంటె ఆమెని గొప్పగా గాయపరిచింది తనని ఎరగా వేసుకుని కుమార్‌కి అర్పించి అతను ప్రమోషన్ సంపాదించి తన భార్యా బిడ్డలని అందలం ఎక్కిస్తున్న వైనం. అతను కావాలనే సుకుమార్‌కి తనని బలిపెట్టా డని అప్పటికి ఆమెకి అర్థంమయింది. అతనికి భార్య, బిడ్డలు వున్నారు. తనని ఎంత హీనంగా భావించకపోతే మరో మనిషి దగ్గరకి పంపగలుగుతాడు ? మరి ఆ భార్యనే పంపి ఎందుకు మునుపే ప్రమోషన్ సంపాదించుకోలేదు? అంటే! అతని దృష్టిలో ఆమె అతని స్వంతం ! ఆమె శీలవతిగా, పరమ పతివ్రతగా వుండిపోవాలి. తను ! తనను భార్యగా మూడు ముళ్ళూవేసి స్వంతం చేసుకుని ఉంపుడుకత్తె క్రింద చూస్తూ చులకన చేయడంకాక మరేమి టీ చర్యల ఆంతర్యం ? ఆమె ఎలాగూ పవిత్రంగా వుంది కనుక తను ఎలా పతనమైనా ఫర్వాలేదులే, అన్న ధోరణే అతని విశాలహృదయం అంటూ చెప్పుకున్న దాని రహస్యం ! ఎంత వంచకుడివి ! ఎంత మోసగాడివి ! ఎంత తేనె పూసిన కత్తివి మదన్ ! ఆడదాన్ని ఉసురు పెట్టి నువ్వు బాగుపడవు. హైందవ స్త్రీని గృహిణిగా నీ కన్నివిధాలా అను రాగవర్తనియై వున్న అమాయకురాల్ని హీనాతిహీనంగా భావిస్తూ "ఎలా తగ లడితే ఏం ? నాకు డబ్బు కావాలి ! నాకో స్వంత భార్య వేరేవుంది. ఆమెమటుకే పవిత్రురాలవ్వాలి" అనే ధోరణిలో ప్రవర్తించిన నిన్ను నాకే శక్తి వుంటే నిలువునా భస్మంచేసి పారేసేదాన్ని అని కుళ్ళి కుళ్ళి ఏడ్చింది సత్యవతి. ఆ రాత్రంతా ఏడుస్తూనే వుంది. తెల్లవారి లేచి మెల్లగా స్నానం చేసి కాఫీ మాత్రం త్రాగి ఆఫీసుకు వెళ్ళిపోయింది. ఇంక తనకిఉన్న జీవ నాధారం అదేగదా, అనుకుంటూ.

అన్నాళ్ళూ మేనేజర్‌గావున్న సుకుమార్‌ని నెల్లూరు బదిలీ చేశారన్న వార్త గుప్పుమంది ఆఫీసు చేరగానే.

ఇప్పుడు అసిస్టెంట్ మేనేజర్‌గా




ఉన్న మదన్‌మోహనే మేనేజ రవ్వచ్చని, ఎంతైనా సత్యవతి అదృష్టవంతురాలని గుసగుసలు పోయారు.

"ఛీ ! అతను చచ్చినా మేనేజర్ కాకూడదు" అనుకుంది సత్యవతి అక్క సుగా మనసులో.

ఆమె కోరిక గ్రహించినట్లే మధ్యా హ్నానికి డైరెక్టరు స్వయంగా వచ్చి తనే ఆఫీసు వ్యవహారాలు చూసుకుంటా నని చెప్పడంతో ఆమెకి కాస్త ఉపశమనం కలిగింది.

ఈ డైరెక్టరు సుధీర్ ఇంచుమించు మదన్ వయసులోనే వున్నాడు. అతను వచ్చి అందర్నీ పరిచయం చేసు కున్నాడు. "అసిస్టెంట్ మేనేజరు వూరు వెళ్ళారు సార్! ఉదయమే రావల్సింది, రాలేదు బహుశా రేపటికి వచ్చేస్తారు" అని ఆఫీసులో అంతా వినిపించారు సుధీర్‌కి.

"ఓహో ! అలాగా !" అంటూ తల ఎగరేశాడు. సత్యవతి అతని భార్య అనికూడా ఆ స్టాఫే తెలియజేశారు. అన్నీ విని వూరుకున్నాడు డైరెక్టరు.

ఆ రోజు సాయంత్రం మనసులో బెరుగ్గావున్నా వచ్చాడు మదన్‌మోహన్! సత్యవతి చిరునవ్వుతో ఆహ్వానించలేదు. అతనే వచ్చి మామూలుగా [illegible] కూర్చున్నాడు. కళ్ళు, ముఖమూ వాచి, తిండి తినక నీరసంతోవున్న సత్యవతిని ఆపాదమస్తకమూ పరీక్షించి మనసు లోనే భయపడిపోయాడు.

"వారాని కోసారి స్వగ్రామం

అంటూ వెళ్లిది, చక్కబెట్టుకుని వస్తున్న పొలం పనులు ఇవేనా ?" సత్యవతి సూటిగా అడగడంతో కాస్త తడబడ్డాడు మదన్.

"క్షమించు సత్యా ! నీకు వెనకే చెప్పాలని అనుకుని చెప్పలేకపోయాను. నీ మీదగల ప్రేమ నన్ను చెప్పనీయ కుండా చేసింది. ఆ విషయం తెలిస్తే నువ్వు నాకు దక్కవని, నా ముఖం చూడవేమోనని భయపడి నీ మీది మమకారం చంపుకోలేక చెప్పడానికి సాహసించలేకపోయాను."

"అనురాగం ! ప్రేమ ! మమకారం ! ఎందు కిన్ని చిలకపలుకులు. ఆ మాటల కసలు అర్థం తెలుసా మీకు ?"

"నేనేం చేశానని అర్థం తెలియక పోవడానికి ?"

"ఇంకా ఏంచేశానని అడుగు తున్నారా ? ఇక్కడ వూరెడుతున్నానని అక్కడ, అక్కడ వూరు వెడుతున్నానని ఇక్కడ చెప్పి మాయబుచ్చటం. ఎటొచ్చీ నే నా ఆఫీసులో పనిచేస్తున్నా గనక సెలవుపెట్టిందీ లేందీ నాకు తెలుస్తుంది గనక చాకచక్యంగా సెలవు పెట్టి పూర్తిగా అక్కడ గడిపి రావడం, ఇక్కడ నాతో సంసారంచేస్తూ ఆఫీసుకు వెళ్ళడం ! ఇవన్నీ మీ తెలివితేటలకి ప్రబల నిదర్శనాలు.

"మరి వాళ్ళని కూడా చూస్తూ వుండాలిగదా ! బొత్తిగా కనపడటం మానేస్తే వాళ్ళు బెంగపెట్టుకోరా ! ఇక్కడ నీకేం లోటు చేసానని ?"

ఆ మాటతో కయ్యిన లేచింది సత్యవతి.

"చూడండి ! బాగా చూడండి ! ఎవరు వద్దన్నారు ? నన్ను పెళ్ళిచేసుకుని నా బ్రతుకు బండలు చేయడం దేనికి? పైగా ఏం లోటు చేసానని దబాయిస్తారు! నన్ను సుకుమార్‌కి అప్పగించింది మీరేగా ? అందుకోసమేగా నన్ను పెళ్ళిపేరుతో మోసంచేసింది ?"

"సత్యా !" అన్నాడు ఇంకేం అనాలో తెలీక.

"సత్యా. అనంగానే పొంగిబోర్ల పడను. నాలుగేళ్ళనించీ చేస్తున్నా ప్రమోషన్ రాలేదని బెంగపడిపోయారే, నన్ను చేసుకునేదాకా ఎందుకు ఆగారు ! ఆ భార్యని పంపి ప్రమోషన్ మునుపే తెచ్చుకోకపోయారా ?" కసిగా అంది.

"పిచ్చిగా మాట్లాడకు ! సీత ఎందుకు చేస్తుంది అలాంటి పన్లు ?"

ఆ మాటతో తోక త్రొక్కిన త్రాచులా లేచింది సత్యవతి.

"ఓహో ! ఆవిడ పేరు సీతన్న మాట. పేరుకు తగ్గట్టు ఆవిడ సాధ్వీమణిలా వుండాలన్నమాట ! ఆవిడ ఇలాంటి పిచ్చిపనులు చేయని పరమ పవిత్రురాలు కావాలన్నమాట ! మరి నేను ! నేను మీ కళ్ళకి బజారు మనిషిలా కనిపించానా ? నా శీలం

అంత చులకనగా వుందా ! ఇదేనా మీ విశాలత్వానికి నిదర్శనం ? అనాటి కబుర్ల ఆంతర్యం ?"

"నేను నిన్ను కావాలని అతని కప్ప గించలేదు — పొరపాటు జరిగిందంటే పోనీలెమ్మని సర్దిచెప్పి నీ మీది ప్రేమ తోనే నీతో యధావిధిగా సంసారం చేయడానికి సిద్ధపడ్డాను."

"ప్రేమ !" ప్రేమని కబుర్లు చెప్పి నన్ను మాయ పుచ్చక్కర్లేదు. ఎవరి ప్రేమ లెంతో నా కిప్పుడు అర్థ మవుతూనే వున్నాయి. అది ప్రేమకాదు. అవసరం! దగ్గరగా వుండకపోతేను, నన్ను దూరం చేసుకుంటేను ముందు ముందు మీభవిష్యత్తుకి దెబ్బతగలదూ!"

"నువ్వు నన్నిలా అపార్థం చేసుకోకు."

అపార్థం ఇన్నాళ్ళూ చేసుకుని కళ్ళు తెరిచాను.

తన శీలాన్ని బలిపెట్టి, మీకూ మీ కుటుంబానికి లోటులేని ఆర్జన కలిగించి మీరు సుఖపడటానికి దోహదమివ్వ డానికి ఎవరూ ముందుకు రారు. అందు కని అమాయకంగా కనిపించే నాలాంటి పిల్లల్ని తీయని మాటలతో వల్లో వేసుకుని పెళ్ళి చేసుకుని ఈ విధంగా నాశనం చేస్తారు నదువుకున్న, ఉద్యో గస్థురాలయిన పిల్లయితే మీకు అన్ని విధాలా లాభం. ఆమెని పోషించక్కర్లేదు. పైకి ప్రేమ కబుర్లు చెబుతూంటే చాలు ! నేను గాఢాతిగాఢంగా ప్రేమించి, హృదయమంతా నింపుకున్న పతిదేవుడు ఇంత గొప్పవా డయినందుకు కుళ్ళి కుళ్ళి చావాల్సింది, సిగ్గుపడా ల్సిందీ నేనే ! నా దురదృష్టానికి నేను ఏడవడం తప్ప ఏమీ చేయలేని వూబిలో ఇరుక్కున్నాను. "రెండు చేతులతో ముఖం కప్పుకుని వంటగదిలోకి వెళ్ళి పోయింది సత్యవతి. మదన్ నీరసంగా కుర్చీలో చతికిలబడ్డాడు. ఇకపై తమ సంసారం ఆఖరు అయినట్లేనా ! అనుకుంటూ.

అలా ఎంతసేపు కూర్చున్నాడో అతనికే తెలియదు. సత్యవతి వచ్చి "భోజనానికి రండి" అని పిలిచింది. అప్పటికి కాస్త ధైర్యం వచ్చి డ్రెస్ మార్చుకుని భోజనానికి వచ్చాడు.

భోజనాలైపోయాక వంటిల్లు సర్దుకుని వచ్చి మంచంమీద వేసి వున్నదుప్పటి మార్చి మరొకటి వేసి తలగడాలు సర్ది మరో దుప్పటి, దిండుతీసుకుని తను క్రింద చాపవేసుకుని పడుకుంది. ఏం అనడానికి పాలుపోక మంచంమీద ఒంటరిగా పడుకున్నాడు మదన్.

తెల్లవారి భోజనంచేసి ఆఫీసుకు బయలుదేరారు మామూలుగా. మదన్‌కి ఆఫీసు చేరేదాకా సుకుమార్ వెళ్ళడం గాని, సుధీర్ రావడంగాని తెలియలేదు. తెలిసి కాస్త కంగారుపడ్డాడు. ఆ తర్వాత తన నిక్కడ మేనేజరుగా నియమించకపోతాడా అని ఆశపడ్డాడు కూడా.

(ముగింపు వచ్చే సంచికలో)